## క్లుప్తంగా

### వలంటీర్ల రాజీనామా



ఎంపీడీఓకు రాజీనామా పత్రాలు అందిస్తున్న వలంటీర్లు

గూడూరు: మండలంలో వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. బుధవారం పట్టణానికి చెందిన 19 మంది వార్డు వలంటీర్లు రాజీనామా చేయగా గురువారం గుడిపాడు గ్రామానికి చెందిన ఆరుగురు వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ కుమారి జయశ్రీకి అందజేశారు. స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు.

### గ్రామాల్లో తాగునీటి సమస్యలు రానీయొద్దు

పాణ్యం: మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ భాగ్యలక్ష్మి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం పాణ్యం మండలంలోని గ్రామ కార్యదర్శులతో సమీక్షించారు. ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే ఉపాధి హామీ పథకంలో కూలీలందరికీ పనులు కల్పించేలా చూడాలని సూచించారు. నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేయించాలన్నారు. వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

### టీడీపీ కార్యకర్తపై కేసు నమోదు

పాణ్యం: మండల పరిధిలోని ఆలమూరు గ్రామంలో అనుమతి లేకుండా ఇంటిపై పార్టీ జెండా కట్టిన టీడీపీ కార్యకర్త అల్లాడి ప్రవీణ్ కృష్ణపై ఎన్నికల నిబంధన ఉల్లంఘన కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు. బుధవారం సాయంత్రం కొందరు వీడియో తీసి సీవిజిల్ యాప్‌లో ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఫణికుమార్, ఎంసీసీ ఇన్‌చార్జి భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

### గడ్డివామి దగ్ధం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

గూడూరు రూరల్: మండల పరిధిలోని పెంచికలపాడులో గురువారం రైతు పెద్ద గోరంట్లకు చెందిన గడ్డివామి ప్రమాదవశాత్తు అంటుకుంది. మంటలు వ్యాపించడాన్ని గమనించిన స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఆర్పేందుకు యత్నించినా ఫలితం లేకుండా పోయింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోగా గడ్డివామి పూర్తిగా కలిపోయింది. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లిందని.. నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు పెద్ద గోరంట్ల కోరాడు.

### నేడు ఆర్.ఖానాపురంలో ఎన్నికల ప్రచారం

గూడూరు రూరల్: మండల పరిధిలోని ఆర్.ఖానాపురంలో శుక్రవారం ఉదయం 7 గంటలకు వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు మౌలాలి తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

### నేడు విగ్రహ ప్రతిష్ఠ పూజలు

గూడూరు రూరల్: మండల పరిధిలోని పెంచికలపాడులో ఈ నెల 26 నుంచి మూడు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహించనున్నట్లు గురువారం ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 26న గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, మాతృకారాధన, 27న వేదపారాయణం, రుద్రాభిషేకాలు, శాంతి హోమాలు, 28న గణపతి, కుమారస్వామి, నందికేశ్వర, ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

### మలేరియాపై అప్రమత్తత అవసరం



వైద్య సిబ్బందితో డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రవీణ్‌కుమార్

గూడూరు రూరల్: మలేరియాపై అప్రమత్తంగా ఉండాలని.. దోమల నివారణకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం గూడూరు పరిధిలోని కె.నాగలాపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడ ఎనాఫిలస్ దోమ కుట్టడం వల్ల మలేరియా వ్యాపిస్తుందన్నారు. దోమలు పుట్టకుండా.. కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జ్వర లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వాస్పత్రుల్లో రక్త పరీక్షలు చేసుకోవాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారులు సుప్రియ, ఈశ్వరయ్య ఉన్నారు.



బూజునూరు పాఠశాల తరగతి గదిలో బొమ్మలు



తరగతి గదిలో గోడలపై వేసిన బొమ్మలు





డిజిటల్ విద్య కోసం ఏర్పాటు చేసిన స్మార్ట్ టీవీలు





బూజునూరు ఎంపీపీ పాఠశాల

# సౌకర్యాల ఒడిలో సర్కారు బడి

- నాడు-నేడు ద్వారా పాఠశాలలకు కొత్త సొబగులు
- కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ బడులు
- మెరుగైన వసతి, నాణ్యమైన విద్య
- మండలంలో రూ.5.58 కోట్లతో పాఠశాలల అభివృద్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



నాడు-నేడు పనులతో మారిన ఒండుట్ల పాఠశాల రూపురేఖలు

గడివేముల: ప్రతి పేదవాడు నాణ్యమైన విద్య, ఉన్నత చదువులు చేసి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ పాలనలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. నాడు-నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చివేశారు. కార్పొరేట్ బడులకు దీటుగా సుందరంగా తీర్చిదిద్దారు. కూర్చోవడానికి బండల్లేని బడులకు మా పిల్లలను పంపేది లేదంటూ భీష్మించుకుని కూర్చున్న తల్లిదండ్రులు నేడు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు క్యూ కడుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. గత టీడీపీ ప్రభుత్వం విద్యను నిర్లక్ష్యం చేసింది. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇంగ్లీష్ మీడియంలో విద్యా బోధన, డిజిటల్, స్మార్ట్ తరగతులు, బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు అందజేసి జాతీయ స్థాయిలో విద్యార్థులు పోటీ పడేలా ప్రోత్సహించింది. పాఠశాలల మరమ్మతులు, నూతన భవనాల నిర్మాణ పనుల కోసం నాడు-నేడు పథకం కింద నిధులు మంజూరు చేసింది. అసలు ఇది ప్రభుత్వ పాఠశాలనే అని ఆశ్చర్యపోయేలా వాటిని తీర్చిదిద్దింది. గడివేముల మండలంలో 13 పాఠశాలల్లో మొదటి విడత పనుల కోసం రూ.2.91 కోట్లు మంజూరు చేసింది.

**రెండో విడతలో రూ.2.67 కోట్లు మంజూరు**

మండలంలో మొత్తం 38 ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 13 పాఠశాలల్లో రూ. 2.91 కోట్లతో మొదటి విడత నాడు-నేడు కింద అభివృద్ధి పనులు జరిగాయి, విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. రెండో విడత నాడు- నేడు కింద గని, గడిగరేవుల, కరిమద్దెలలోని జిల్లా పరిషత్ హైస్కూల్స్‌ను ఎంపిక చేశారు. అదనపు తరగతి గదుల నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత కల్పించారు. గని హైస్కూల్‌కు ఐదు నూతన తరగతులకు రూ.60 లక్షలు, పాఠశాలలో నాడు-నేడు కింద రూ.81 లక్షలు మంజూరైంది. గడిగరేవుల హైస్కూల్‌కు రూ.63 లక్షలు, కరిమద్దెల హైస్కూల్‌కు రూ.63 లక్షలు మంజూరై పనులు దాదాపు పూర్తి కావచ్చాయి.

**ఆకట్టుకునేలా పాఠశాల గదులు**

విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా తరగతి గదుల్లో వారాలు, నెలలు, సింబళ్లతో రంగుల బొమ్మలు వేయించారు. ప్రతి గదిలో నాలుగేసి ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్‌లు ఉండేలా ఏర్పాట్లు చేశారు. ప్రాథమిక విద్యలోనే ఇంగ్లీష్ భాషపై విద్యార్థులు పట్టు సాధించేలా తగిన బోధనోపకరణ సామగ్రి సిద్ధం చేశారు. ప్రతి పాఠశాలలో ఇంగ్లీష్ ల్యాబ్.. అందులో 4కే ఆండ్రాయిడ్ స్మార్ట్ టీవీలు కూడా ఏర్పాటు చేశారు.

**స్కూలులో చేరిన రోజునే పుస్తకాలు**

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరిన వెంటనే పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. అలాగే ప్రతి విద్యార్థికి విద్యాకానుకల కింద తొమ్మిది రకాల వస్తువులు అందిస్తున్నారు. పేదలకు అమ్మ ఒడి కింద సంవత్సరానికి రూ.15 వేలు విద్యార్థి తల్లి బ్యాంకు ఖాతాలో నగదు జమ చేస్తున్నారు. గోరుముద్దతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు.

**నాడు-నేడు మొదటి విడతలో మంజూరైన నిధులు**

| పాఠశాల పేరు | మంజూరైనా నిధులు (రూ.లక్షల్లో) |
|---|---|
| గడివేముల (ఎంపీపీ)పాఠశాల | 21.14 |
| గడివేముల ఏపీ మోడల్ పాఠశాల | 43.70 |
| కస్తూర్బా | 34.49 |
| బూజునూరు (ఎంపీపీ)పాఠశాల | 11.64 |
| గని (ఎంపీపీ) | 22.34 |
| మంచాలకట్ట (ఎంపీపీ) | 22.35 |
| ఒండుట్ల (ఎంపీపీ) | 17.28 |
| కొర్రపోలూరు (ఎంపీపీ) | 14.38 |
| బిలకలగూడూరు యూపీ స్కూల్ | 18.37 |
| కరిమద్దెల (ఎంపీపీ)పాఠశాల | 22.98 |
| గడిగరేవుల (ఎంపీపీ) | 22.57 |
| కొరటమద్ది (ఎంపీపీ) | 22.48 |
| పెసరవాయి (ఎంపీయూపీ) పాఠశాల | 17.62 |
| మొత్తం | 291.34 |





నాడు.. అధ్వానంగా ఉన్న పెసరవాయి యూపీ స్కూల్, దుస్థితికి చేరుకున్న తరగతి గది

### మా ఊరి బడి బాగుంది



స్థానిక పాఠశాలలో సరైన వసతులు లేవనే కారణంతో నా కుమారుడు మద్రి నరేంద్రను గడివేములలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నాలుగేళ్లు చదివించాను. డబ్బులు పోయినాయి తప్ప చదువు రాలేదు. మా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నాడు-నేడు పనులతో రూపు రేఖలు మారిపోయాయి. దీంతో మూడో తరగతిలో అడ్మిషన్ తీసుకున్నాను. ఇప్పుడు ఐదో తరగతి చదువుతున్నాడు. బాగా చదువుతున్నాడు. కార్పొరేట్ పాఠశాలలో లేని వసతులు ప్రభుత్వం పాఠశాలలో ఉన్నాయి. చాలా సంతోషంగా ఉంది.

–మద్రి గిరిజ, బూజునూరు గ్రామం

### మధ్యాహ్న భోజనం రుచిగా ఉంటోంది



గతంలో మధ్యాహ్న భోజనం సరిగా తినేవాళ్లం కాదు. ఇప్పుడు చాలా రుచిగా ఉంటోంది. రోజూ పాఠశాలలోనే తింటున్నాను. ఇంట్లో భోజనంలాగే ఉంటోంది. భోజనం తయారైన అనంతరం రోజుకో ఉపాధ్యాయుడు వెళ్లి భోజనం పరిశీలించి అనంతరం మాకు అందజేస్తారు. బలం కోసం రాగిజావ ఇస్తున్నారు. నాడు-నేడు పనుల ద్వారా మా పాఠశాలలో అన్ని సదుపాయాలు కల్పించారు. – జోస్న్య, 9వ తరగతి విద్యార్థిని, జెడ్పీ ఉన్నత పాఠశాల, గడివేముల

### విద్యార్థులకు సకల సౌకర్యాలు



సాంకేతిక విద్యను అందిపుచ్చుకుని పోటీ ప్రపంచంలో రాణించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం. ప్రభుత్వం డిజిటల్ విద్య కోసం స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేయించింది. ఇంగ్లీష్ భాషను వినడం, చూడటం ద్వారా విద్యార్థులు పట్టు సాధిస్తున్నారు. నేను ప్రభుత్వ పాఠశాలలో ఇన్ని సదుపాయాలు ఎప్పుడూ చూడలేదు. విద్యార్థులకు కావాల్సిన అని సదుపాయాలు కల్పించడంతో విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు.

– రవి, హెచ్‌ఎం, (ఎంపీపీ)పాఠశాల, బూజునూరు



నేడు.. కార్పొరేట్ స్కూల్‌ను తలపిస్తున్న పెసరవాయి పాఠశాల

# ఎన్ని కూటములొచ్చిన మళ్లీ జగనే సీఎం

- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- కల్లూరు అర్బన్‌లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్ని పార్టీలు జత కట్టినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 19వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు కూటమి కట్టారన్నారు. 2014లో 600పైగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా మోసం చేసిన విషయాన్ని ప్రజలు మరిచిపోలేదన్నారు.అందుకే బాబుకు 2019 ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారన్నారు. నవరత్నాల పథకాలతో పేదల జీవితాలు బాగుపడ్డాయన్నారు. సంక్షేమ పథకాల ఎంపికల్లో అర్హతే ప్రామాణికంగా తీసుకుని కులమతాలు, రాజకీయాలు, వర్గాలు, పార్టీలు చూడకుండా అర్హులైన వారందరికీ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గత టీడీపీ పాలనలో పేదలకు ప్రభుత్వ పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీ సిఫారసులతో పాటు నాయకుల అండదండలు ఉండాలన్నారు. టీడీపీకి ఓటేస్తే మళ్లీ 2014 పరిస్థితే పునరావృతమవుతందని చెప్పారు. జగనన్న సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పాణ్యం ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు గోపాల్‌రెడ్డి, భీమాశంకర్‌రెడ్డి, రంగారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, బాలచంద్రారెడ్డి, సుకుమార్, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి పాల్గొన్నారు.

# నాయకుడిగా కాదు.. సేవకుడిగా పనిచేస్తా

- ఏ కష్టం వచ్చినా అండగా ఉంటా
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్



గూడూరులో ప్రచారం చేస్తున్న సతీష్, కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ప్రకాష్ రెడ్డి

గూడూరు: నియోజకవర్గ ప్రజలకు నాయకుడిగా కాకుండా సేవకుడిగా పనిచేస్తానని..తనను ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ అన్నారు. గురువారం కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాష్‌రెడ్డితో కలిసి గూడూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కష్టమొస్తే తీర్చడానికి పెద్ద కొడుకులా ముందుంటానని భరోసా కల్పించారు. నిత్యం అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని తెలిపారు. సంక్షేమ పథకాలు ఇంటి ముంగిటకే అందాలంటే మరోసారి వైఎస్ జగన్‌ని ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎంపీగా బీవై రామయ్య, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వృద్ధుడికి భరోసా కల్పిస్తున్న ఆదిమూలపు సతీష్

# జగనన్నతోనే పేదల సంక్షేమం



కోడుమూరులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న స్టెల్లా సతీష్

కోడుమూరు రూరల్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పథకాల అమలు సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ భార్య స్టెల్లా సతీష్ అన్నారు. గురువారం కోడుమూరులోని కొత్తపేట, కల్లుపెంటవీధి, ఎస్సీ, బీసీ కాలనీల్లో కుమార్తె రీతు, జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పాలనలో దళారీ వ్యవస్థ లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయని.. సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందించారని తెలిపారు. ఈ సేవలు ఇలానే కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మాదులు, మాజీ ఉపసర్పంచ్ ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, నాయకులు షాజిత్ ఆలీ, మల్లారెడ్డి, మగ్బుల్‌బాషా, తేనేశ్వరరెడ్డి, కల్యాణ్, లింగమయ్య, లింగన్న, రాఘవేంద్ర, విష్ణుదాసు, వీర, కట్టెల శ్రీనివాసులు, వెంకటేష్, సోమన్న, అశోక్, పరమేష్, సుబ్బారావు, మాసుమ్ పాల్గొన్నారు.

# జగనన్న పాలన.. సంక్షేమానికి చిరునామా



కాల్వబుగ్గలో ప్రచారం చేస్తున్న కాటసాని ఉమామహేశ్వరమ్మ

ఓర్వకల్లు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పాలన, అభివృద్ధి సాధ్యమని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సతీమణి ఉమామహేశ్వరమ్మ అన్నారు. గురువారం మండలంలోని గుడుంబాయి తండా, కాల్వబుగ్గ, కాల్వ గ్రామాల్లో ఎన్నిల ప్రచారం నిర్వహించారు. ఇప్పుడు అమలు అవుతున్న సంక్షేమ పథకాలతో పాటు మరింత మేలు జరగాలంటే మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పోచా బ్రహ్మానందరెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, సర్పంచ్‌లు దీప్తిబాయి, కె.పెద్ద వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యుడు నాగిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా, నాయకులు బాస్కర్‌నాయుడు, చిన్న వెంకటేశ్వర్లు, ఎర్రెద్దుల సుల్తాన్, చంద్రశేఖర్, మద్దిలేటినాయక్, సుబ్బనాయక్, శత్రునాయక్, రాజునాయక్ పాల్గొన్నారు.

### మురుగు కాలువలు నిర్మించలేని దుస్థితి

కల్లూరు: కార్పొరేషన్‌లో విలీనమై 25 ఏళ్లు పూర్తయినా కాలనీల్లో మురుగు కాలువలను కూడా నిర్మించలేని దుస్థితిలో కార్పొరేషన్ ఉందని.. చేతకాని పార్టీలకు ఓటు అడిగే హక్కు లేదని సీపీఎం పాణ్యం అభ్యర్థి డి.గౌస్ దేశాయ్ అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 37వ వార్డు వీకర్‌సెక్షన్ కాలనీ, సూర్యనారాయణ నగర్, సదాశివనగర్, నేతాజీ హౌసింగ్ కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కల్లూరు కాలనీల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. తనను గెలిపిస్తే సమస్యలను పరిష్కరిస్తానన్నారు.

### బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ఆలూరు రూరల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ మద్దమ్మ అన్నారు. అరికెర గ్రామంలో ఓ బాలిక ఇటీవల పదో తరగతి 441 మార్కులతో పాసైంది. అయితే బాలికకు తల్లిదండ్రులు త్వరలో పెళ్లి చేయాలని నిశ్చయించుకున్నారు. విషయం తెలుసుకున్న ఆలూరు సీడీపీఓ మద్దమ్మ, సూపర్‌వైజర్ పద్మావతితో కలిసి గురువారం గ్రామానికి వెళ్లి తల్లిదండ్రులకు సర్పంచ్ నాగరాజు ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్య వివాహం వల్ల కలిగే నష్టాలను వివరించారు. బాగా చదివించి ప్రయోజకురాలిని చేయాలని సూచించారు.

# వాహనాల వేలంలో రూ.33 వేల ఆదాయం



సీజ్ చేసిన మద్యం, సారాను ధ్వంసం చేస్తున్న సెబ్ సిబ్బంది



వాహనాలకు వేలం వేస్తున్న సెబ్ సిబ్బంది

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన 8 ద్విచక్రవాహనాలకు గురువారం వేలం పాట నిర్వహించారు. జీఎస్టీతో కలుపుకుని రూ.33,158 ఆదాయం వచ్చినట్లు సెబ్ సీఐ రామాంజినేయులు తెలిపారు. అలాగే 17 కేసుల్లో సీజ్ చేసిన ఇతర రాష్ట్రాలకు చెందిన 142 లీటర్ల మద్యం, 18 కేసుల్లో సీజ్ అయిన ఏపీకి చెందిన 39.78 లీటర్ల మద్యం, 13కేసుల్లో సీజ్ చేసిన సారాను ధ్వంసం చేసినట్లు వెల్లడించారు.

# సందడే.. సందడి



చిన్నారుల ఆటవస్తువులను కొనుగోలు చేస్తున్న తల్లిదండ్రులు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామంలో కోన వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన అంగళ్ల వద్ద భక్తుల సందడి కనిపిస్తోంది. ఉత్సవాలకు వచ్చిన భక్తులు, గ్రామ ప్రజలు అంగళ్లలో వస్తువుల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా మహిళల గాజులు, చిన్నారుల ఆట వస్తువులు, గృహ ఉపకరణాలు, చిరుతిళ్లను కొనేందుకు మక్కువ చూపుతున్నారు. అదేవిధంగా రంగుల రాటన్నం, ఊయల వద్ద చిన్నారులు సందడి చేస్తున్నారు.

**ఘనంగా వసంతోత్సవం**

కోన వేంకటేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం వసంతోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను గ్రామ సమీపంలోని పెద్ద బావి దగ్గరకు తీసుకెళ్లి చక్రం స్నానం చేయించారు.

**నేడు క్రిష్ణదొడ్డిలో బండలాగుడు పోటీలు**

క్రిష్ణదొడ్డి గ్రామంలో శుక్రవారం జిల్లా స్థాయి పాల పండ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. తొలి ఐదు స్థానాల్లో నిలిచే వారికి వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10వేలు, రూ.6 వేలు నగదు బహుమతి అందజేస్తామన్నారు. పాల్గొనే వారు రూ.500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. అన్నదాన కార్యక్రమం ఉంటుందని, వివరాలకు 9502430615, 9052736826 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



మిఠాయిలను కొనుగోలు చేస్తూ..



చిన్నారుల సందడి



గాజులు కొనుగోలు చేస్తున్న మహిళలు